

పెళ్ళిళ్ళకూ పాదరక్షలకూ చాలా దగ్గర సంబంధం ఉందని అందరూ ఒప్పుకుంటారు. ఒప్పుకోవడమే కాదు. వళ్ళు మండిందంటే "ఎవడన్నా లేదన్నాడంటే వాడిని చీరేస్తాం" అని కూడా అంటారు. పెళ్ళివారికి కట్నాల గురించి గానీ, మరే ఇతర లాంఛనాల గురించిగానీ పేచీ వచ్చిందనుకోండి. అప్పుడు వారు చెప్పులు యుధేచ్ఛగా ఉపయోగించుకుంటారు. లేదా ఇద్దరూ కలిసి మధ్యవర్తి మీద ప్రయోగిస్తారు.

అయితే నేను రాయదల్చుకులేది ఈ విధమైన సంబంధం గురించి కాదు. మనందరం అనుభవించే మరో సంబంధం గురించి.

అదేమిటంటే పాదరక్షలు పోగొట్టుకోవటం.

అంటే నా ఉద్దేశ్యం పెళ్ళిళ్ళలో ఇంకేమీ పోవని కాదు. ఆ మాటకొస్తే పెళ్ళిళ్ళల్లోపోని వస్తువంటూ ఉండదు. గరిటెలు, వ్యాసులూ, బట్టలూ, పాత్రలూ, నగలూ, చిన్న పిల్లలూ, పిటాయిలూ— ఇలా అయా పెళ్ళిళ్ళకొచ్చిన అతిథుల అభిరుచులను బట్టి అన్నీ పోతూ ఉంటాయి. కానీ వీటన్నింటి కంటే కూడా సిన్నమెట్గా, అదో నిబంధనగా చాలా మంది చెప్పులు పోగొట్టుకోవడంవల్ల పెళ్ళిళ్ళలో పాదరక్షలకున్న ప్రాముఖ్యత మరి దేనికీ ఉండదు. ఇక ముందు ఉండబోదు.

నేను రెండేళ్ళపాటు జీతంలో ప్రతి నెలా కొంత డబ్బు వాయిదా పద్ధతిలో ఒక చెప్పుల షాపు వాడికి కట్టి, నాకెంతో ఇష్టమైన చెప్పుల జత ఆ మధ్యే కొన్నాను. అంటే ఆ బాకీ తీరిపోయిందని కాదు.

మరో ఎనిమిది నెలలపాటు వాడికి వాయిదాలు చెల్లిస్తూనే ఉంది. అప్పుడు పూర్తిగా అవి నా సొంతం అవుతాయన్నమాట! అంతవరకూ అవి ఆ షాపు యాజమాన్యం పేరే ఉంటాయి. మధ్యలో నేను చనిపోవడంవల్లగాని, లేదా మరే కారణంవల్ల నూనీ మిగతా వాయిదాలు కట్టడం మానేస్తే వాటి యజమానులు వాటిని స్వాధీనం చేసేసుకుంటారు.

అంచేత ఆ ఎనిమిది నెలలూ అయాకే వాటిని వాడడం ప్రారంభించాలని నిర్ణయం తీసుకుని, వాటిని ఆ షాపు యాజమాన్యంవారిచ్చిన అట్టపెట్టెతో సహా ప్లాస్టిక్ అల్మారాలో దాచేశాను.

నా ఈ అద్భుతమైన ప్లాన్ తప్పక విజయవంతం అయేదేమోగానీ—ఇంతలో మా రామరాజుగాడి పెళ్ళి వచ్చేసింది. సరిగ్గా ఆ సమయానికే నా పాత చెప్పులు ఇక రిపేరికి పనికి రావని ఖండితంగా చెప్పేశాడు, అవి గత మూడేళ్ళనుంచి రిపేరు చేస్తున్న చెప్పుల మెకానిక్.

పాదరక్షల ప్రహసనం

యర్రంశెట్టి శాయి

గత్యంతరం లేక కొత్త చెప్పులు వేసుకునే వాడి పెళ్ళికి చేరుకున్నాను. పొరపాటునయినా వాటికి ఎదురు దెబ్బలూ, గాయాలు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నాను. ఎందుకంటే వాటిమీద పూర్వాధికారాలూ ఇంకా ఆ షాపు యజమానికే ఉన్నాయి కదా!

పెళ్ళి తంతు ముగిసింది.

"అ! భోజనాలకు రండి బాబు!" అని అరిచా రెవరో.

మరుక్షణం పందిట్లో జనమంతా హాల్లోకి పరుగెత్తిపోయారు. నేనూ నా చెప్పుల్ని జాగ్రత్తగా ఓ పక్కన విడిచి భోజనానికని లోపలికెళ్ళాను. అప్పటికే హాలంతా నిండిపోవడంచేత రెండో పంక్తిలో కూచో వచ్చని మళ్ళీ బయటికొచ్చి చూసేసరికి చెప్పులు వాటి స్థానంలో కనిపించలేదు. నా గుండెలు జల్లుమన్నాయి.

త్వరత్వరగా ఆవరణ అంతా వెదికాను. ఎక్కడా లేవు.

"ఏం, గురూజీ! ఏమిటి చూస్తున్నావూ?" అడిగాడు నరసింహం. వాడూ, నేనూ ఒకప్పుడు క్లాస్‌మేట్స్‌మి.

"చెప్పులు కనిపించటం లేదు" అన్నాను కంగారు అణచుకుంటూ.

"ఎవడో కొట్టేసి ఉంటాడు—దానికి పెద్ద ఇదేముంది" అన్నాడతను.

"అదేమిటి? నేను వాటిని విడిచి ఒక్క నిముషమేగా అయింది?"

"ఒక్క నిముషం చాలా ఎక్కువ వాడికి."

"ఎవడు వాడు?"

"అది తెలుస్తే కథ లేదుగా?" నవ్వుతూ అన్నాడు.

నేను పెద్దాడయినాక ఎప్పుడూ ఏడవలేదు. చిన్నప్పుడు ఏడవడమే! మరి ఇంతకాలం ప్రాక్టీస్ లేకపోయినా ఇప్పుడు ఇన్‌స్టెంట్‌గా ఏడుపొచ్చింది. వాటికి కట్టవలసిన మిగతా వాయిదాలు తీరకుండానే, వాటి మీద సర్వహక్కులూ ఆ షాపు యాజమాన్యానికుండగానే—పోగొట్టుకుంటే ఇప్పుడు వాళ్ళకేం జవాబు చెప్పాలి?

నిరాశగా కుర్చీలో కూలబడ్డాను.

నరసింహంగాడు నా పక్కనే కూర్చున్నాడు. కూర్చుని ఆ చెప్పుల వివరాలన్నీ ఒకటొకటే అడిగి తెలుసుకుని మరీ సానుభూతి ఒలకబోస్తున్నాడు. వాడు సానుభూతి ఒలకబోస్తున్నకొద్దీ నాకు మరీ ఏడుపెక్కువై పోతూంది.

"గురూ! నేనో ప్లాన్ చెప్తాను. చేస్తావా?" అన్నాడు వాడు రహస్యంగా.

"ఏమిటి?" అనుమానంగా అడిగాను.

"చెప్తానంటే చెప్తాను."

"ఏదీ అప్పుడు కాలేజీలో చేయించినట్లేనా?" కోపంగా అడిగాను.

ఆ కథ ఏమిటంటే కాలేజీలో మమ్మల్నిద్దరినీ ఏదో విషయంలో ప్రిన్సిపాల్ వారంరోజులపాటు డిబార్ చేయించాడు. ప్రిన్సిపాల్‌మీద ఎప్పటికైనా నేను ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేస్తే, నరసింహంగాడు, "ఎప్పటిదాకానో ఎందుకురా? ఇవాళే తీర్చుకోవచ్చు. దానికి నేనో ప్లాన్‌చెప్తాను" అన్నాడు. ఆ ప్లానేమిటంటే ప్రిన్సిపాల్‌కి వ్యతిరేకంగా కాలేజీలో గోడల నిండా బొగ్గుతో అశ్లీలపదాలు రాయడం. ఆ ప్లాన్‌మహత్తరమైందని వాడు నన్ను నమ్మించడం చేత నేను ఆ రాత్రి గోడల మీద బొగ్గుతో రాస్తూ పోలీసులకు దొరికిపోయాను. వాళ్ళ బారి నుంచి తప్పించుకుని బయటపడడానికి నెల రోజులు పట్టింది.

నరసింహం మనస్ఫూర్తిగా నవ్వాడు.

"ఛచ! అది వేరు. ఇది వేరు! ఇది పర్‌ఫెక్ట్ ప్లాన్" అన్నాడు.

"ఏం చేయమంటావ్?"

"ఏదో మరో మంచి జత చెప్పులు చూసి వేసుకుని వెళ్ళిపో."

నేను ఉలిక్కిపడ్డాను. "ఇంకొకరివా?"

"అవును."

"ఛీ తప్పు కదూ?"

"మరి నీ చెప్పులు వేసుకెళ్ళినవాడు తప్పు అనుకోలేదుగదా!"

"ఓహో అటునుంచి వచ్చావా!" ఆలోచిస్తూ అన్నాను.

నా వీక్‌నెస్ కనిపెట్టి వాడు మళ్ళీ నా చెవి దగ్గర గొణిగాడు.

"నీకేం సంకోచం అక్కర్లేదురా! ఇదిగో! నా చెప్పులుచూడు! ఇవి నా స్వంతంఅనుకుంటున్నావా? అబ్బే! ఇలా కొట్టేసినవయ్యే!"

నేను వాడి చెప్పుల వంక చూశాను. చాలా కొత్తగా అద్భుతంగా ఉన్నాయి.

"మరి ఎవ్వరూ కనిపెట్టలేదూ?" అనుమానంగా అడిగాను.

"వాటి ఓనరు నా ముందు నుంచి పద్నాలుగుసార్లు తిరిగాడు గానీ, గుర్తుపట్టలేదు. ఒకవేళ గుర్తుపట్టినా అడిగే ధైర్యం ఎక్కడి నుంచి వస్తుంది? అయినా నీకేం ఫర్లేదు, నేను నీ పక్కనే ఉంటాను!"

నాకు కొంచెం ధైర్యం వచ్చింది.

"ఇప్పుడేం చేయమంటావు?"

"లేచి రంగంలోకి దూకు! వరండాలోకెళ్ళు. అక్కడున్నవాటిల్లో బెస్ట్ జత సెలెక్ట్ చేసుకో! అటూ ఇటూ చూడకుండా—సిగరెట్ వెలిగించుకుంటూ వాటిని కాజువల్‌గా తొడుక్కో—అంతే. ఆ తరువాత తిన్నగా ఇంటికెళ్ళిపో—వెనక్కు తిరిగి చూడవద్దు. వెనుక నుంచి కేకలు, అరుపులు, పోలీస్ విజిల్స్—ఇలాంటివేవి వినిపించినా వెనక్కు తిరక్కు! జయం నీదే!"

"అంతేనంటావా?" వణుకుతున్న గొంతుతో అన్నాను.

"అంతే!"

నేను కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాను. వరండాలో చిందరవందరగా కనబడుతున్నాయి చెప్పులు. త్వరత్వరగా నడిచి మాంచి కొత్త జత దగ్గర ఆగి సిగరెట్ వెలిగించుకున్నాను. మరుక్షణంలో ఆ చెప్పులు రెండూ నా కాళ్ళకు అమరిపోయాయి. వెనక్కు తిరిగి రెండడుగులు వేసేసరికి ఎవరో భుజం తట్టారు. నా ప్రాణాలు పైకి రాకెట్‌లా దూసుకుపోయాయి. వణుకుడుని సర్దుకుంటూ వెనక్కు తిరిగి చూశాను. లావుపాటి పొట్టగల ఆకారం నన్ను చూసి నవ్వింది.

"ఏ. . .ఏ. . .ఏ. . .మి . . . టి. .?" అన్నాను ఏడుపు ఆపుకుంటూ.

"చెప్పులు. . ." అన్నాడు నా కాళ్ళవైపు చూపిస్తూ.

నాకు అర్థమైపోయింది. నేను పట్టుబడి పోయాను. అతను పొట్టను కౌగలించుకుని బావురు మని ఏడ్చేయాలన్న ఫీలింగ్‌ని బలవంతంగా ఆపుకున్నాను.

"నిజం సార్! ఇవి నావే—భలేవారే! నేనలాంటి పని చేస్తానా? ఒట్టు—కావాలంటే మా నరసింహం నడగండి—వచ్చేప్పుడు ఇవి వేసుకున్నానో, లేదో—" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో.

ఆ లావుపాటి ఆకారం మళ్ళీ నవ్వింది.

"అబ్బే—నేననేది అది కాదు. మీ కాళ్ళవంక చూడండోసారి."

నేను నా కాళ్ళవంక చూసుకున్నాను.

రెండు కాళ్ళకూ రెండురకాల చెప్పులున్నాయి అంటే ఆ ఖంగారులో నేను రెండు రకాల చెప్పుల తొడిగేసుకున్నానన్నమాట!

"ఇదా—నేను చూసుకోలేదు లెండి. ఏదో ఆలోచిస్తూ. . .ఇహిహి. ." అంటూ ఆ లావుపాటి ఆకారానికి థాంక్స్ చెప్పి రెండో కాలి చెప్పు తీసేసి దాని తాలూకు జతచెప్పు తొడుక్కుని వరండా దిగి పందిట్లోకొచ్చినరసింహం పక్కగా కూర్చున్నాను.

"అలా వణకకు! బావుండదు" అన్నాడు వాడు కోపంగా.

"నే. . .నే. . .నే. . .నెక్కడ. . .వ. . .వ. . .ణుకుతున్నాను. . ." అన్నాను ఖంగారుగా.

"నా మాట విని ఇక్కడి నుంచి మా ఇంటికి త్వరగా వెళ్ళిపో! నువ్వలా వణకడం చూస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది."

"మ. . .మ. . .రి. . .భో. . .జ. . .జ. . .నం".

"పోతే పోనీ—వెధవ భోజనం! భోజనంకోసం చూసుకుంటే పట్టుబడిపోతావ్!"

గత్యంతరం లేక లేచి వడివడిగాబయుటకు నడవ్వ బోయాను. తీరా రెండడుగులు వేశానో లేదో, "ఏవండోయ్ మాస్టారూ. . ." అంటూ ఎవరో నన్ను పిలవడం వినిపించింది. హఠాత్తుగా నాలో మళ్ళీ వణుకు జబ్బు ప్రవేశించింది. ఎవరో నన్ను కనిపెట్టేశారు. ఆ చెప్పుల వోనరే కేక పెట్టి ఉంటాడు.

ఏమిటిప్పుడు చేయడం?

నాకు సడన్‌గా నరసింహంగాడి మాటలు గుర్తుకొచ్చాయి.

"ఇలాంటి మహత్తరమైన కార్యక్రమం చేపట్టినప్పుడు వెనక్కి తిరిగి చూడకు! అరుపులు, కేకలు, పోలీస్ విజిల్స్—ఇలాంటివేవి వినిపించినా వెనక్కి తిరగకు— అంచేత నేను వెనక్కి తిరగదల్చుకోలేదు. ధైర్యంగా ముందుకు సాగిపోయాను.

కానీ ఆ వ్యక్తి అరుపులతో ఆగలేదు.

పెద్ద అంగలూ వేసుకుంటూ నాకెదురు వచ్చి అడ్డం నిలబడ్డాడు. ఇలాంటి చెప్పుల యజమానులు అడ్డం నిలబడే పరిస్థితి వస్తేనప్పుడు ఏం చేయాలో నాకు నరసింహం క్లూ ఇవ్వలేదు. అందుక వాడివైపు చూశాను. వాడు ఇదేం పట్టనట్టు సినిమా పత్రిక చదువుకుంటున్నాడు.

"ఇవి నావేనండీ!" అన్నాను గాభరాగా.

"ఏవి మీవి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఇవే చెప్పులు. . ."

"చెప్పులేమిటి ?"

"అదే కాళ్ళకేసుకునే చెప్పులు."

"కాళ్ళ కేసుకునే చెప్పులా?"

"అవును."

"అయితే—వాటి కేముంది?"

"అవి నావే అంటున్నాను. కావాలంటే మా సింహంని అడగండి" అంటూ "ఒరే నరసింహం అని పిలిచాను వాడిని.

"ఆ ! ఏమిటి?" అంటూ పరుగుతో వచ్చాడు వాడు.

"ఈ నొప్పులు చెప్పేకదరా?" ఖంగారుగా అని వెంటనే సరిదిద్దుకుని, "ఈచెప్పులు నావేదుట్రా?" అనడిగాను.

"అవును మాష్టారూ! హి ఈజ్ ది వోనర్ ఆఫ్ దీజ్ చెప్పల్స్! ఆ విషయం నేను ఖండితంగా చెప్పగలను. ఎలా చెప్పగలనంటారా? వాడు అలాంటి వాడుకాదు కాబట్టి ! నాకు తెలిసినంతవరకూ





ఎప్పుడూ ఎవరి చెప్పులూ దొంగతనం చేయలేదు. ఎన్నో మంచి అవకాశాలు వచ్చాయ్. కొత్తవి, అద్భుతమయిన మోడల్స్—విదేశీ బూట్లు కూడా కనిపించాయ్. అయినా వాడెప్పుడూ వాటి వంకయినా చూడలేదు. నేనూ అంతే! ఎప్పుడూ నా చెప్పులే వేసుకుంటాను. ఎంత పాతవయినా సరే! పెళ్ళిళ్ళకు వెళ్ళినా సరే—'మీ చెప్పులే మీరు ఉపయోగించుడు' అన్న ప్రిన్సిపుల్‌కి లోబడి జీవితం గడుపుతున్నాం! అంచేత, దయచేసి వాడిని అనుమానించకండి! వాడి చెప్పులకు వాడే యజమాని! అలాగే నా చెప్పులకు నేనే ఓనర్‌ని! ఇద్దరం కేవలం నీతిమీద నిలబడతాం గానీ, పరాయివాడి చెప్పుల మీద కాదు."

ఆ పెద్దమనిషి చిరాగ్గా చూశాడు నరసింహాన్ని.

"ఇప్పుడు చెప్పుల దొంగిలించారని ఎవరన్నారయ్యా. తమరు భోజనం చేయకుండా వెళ్ళడానికి సిద్ధపడుతున్నారేమో అనుకున్నాను. అంతే" అన్నాడు నాతో వినయంగా.

నాకు పోయిన ప్రాణాలన్నీ కేరింతలు కొట్టుకుంటూ తిరిగి వచ్చేసినాయి.

"భోజనమా? దానిదేముంది—తరువాత చేస్తాను అలా వెళ్ళి వచ్చి..."

"అలా వద్దు, సార్! దయచేసి భోజనం చేశాకే వెళ్ళండి! కొంచెం ఆలస్యం అయిన మాట నిజమే! అంతమాత్రాన అలా కోపగించుకుంటే ఎలాగండీ—రండి! అలా రెండు నిముషాలు కూర్చోండి! రెండో బంతి పావు గంటలో రెడీ అవుతుంది...." అంటూ నా చేతులు పట్టుకుని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టాడు. చేసేదిలేక వెధవ ముఖం వేసుకుని కూర్చున్నాను. నరసింహం కూడా నా పక్కనే కూర్చున్నాడు.

"మనం తొందరపడి చెప్పుల గురించి మాట్లాడకూడదు" అన్నాడు వాడు.

"అవును! ఇప్పుడు కదా ఆ విషయం తెలిసింది" అన్నాను నేను.

"ఈసారి ఎవరైనా పిలిచినా వస్తే చెప్పుల గురించి మాట్లాడకూడదు" అన్నాడు వాడు.

"ఇప్పుడు తదుపరి కార్యక్రమం ఏమిటి?" అడిగాను మళ్ళీ చెప్పుల సంగతి గుర్తు తెచ్చుకుని.

"ఏముందీ? ఈసారి వాడు పిలుస్తున్నా ఆగకుండా బయటకు పరుగెత్తు..."

"అలా పరుగెడితే అందరికీ అనుమానం రాదూ?"

"వచ్చినాసరే. మన దేహ సౌందర్య రక్షణ ముఖ్యం కదా?"

"అంతేనంటావా?"

"అక్షరాలా అంతే!"

"పోనీ భోజనం చేశాకయితే బాగుంటుందేమో. అప్పుడయితే వాడిక అడ్డుపడడు."

"వాడు అడ్డుపడడు గానీ, ఇప్పుడు మొదటి పంక్తిలో కూర్చుని భోజనం చేస్తున్న ఈ చెప్పుల ఓనరు బయటికొస్తే తప్పక అడ్డుపడతాడు."

"అవునవును! ఆ విషయం మర్చేపోయాను." అన్నాను మళ్ళీ వణుకులోకొచ్చేస్తూ.

"హలో" అన్న గొంతు వినిపించి ఇద్దరం అదిరిపడ్డాం.

మా వెనకాలే నిలబడ్డాడో వ్యక్తి. అతని చిరునవ్వు చూడగానే మళ్ళీ ప్రాణాలు ఎగిరిపోయాయి. గతంలో ఇలా చిరునవ్వుతో పలకరించే వాళ్ళను చూస్తే భలే ముచ్చటవేసేది. కానీ ఈ చెప్పులు తస్కరించిన కొద్దిసేపటి నుంచీ—ఆ చిరునవ్వు ఎంతో భయంకరంగా, గుండెలవిసిపోయేలా కనబడుతోంది.

"యస్" అన్నాడు నరసింహం ధైర్యంగా.

నేను ఆ పెద్ద మనిషికి నా చెప్పులు కనుపించకుండా కాళ్ళు కుర్చీ కిందకు లాక్కున్నాను.

అతను మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

నాకు చటుక్కున నరసింహంమాటలు గుర్తుకొచ్చాయి. అతను వచ్చిందిచెప్పుల గురించి కాదేమో!

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది—" అన్నాను సంభాషణ వేరే రంగంలోకి దింపుతూ.

"ఉండొచ్చు—ఉండొచ్చు" అన్నాడతను ఇంకా చిరునవ్వు నవ్వుతూనే.

నరసింహం నా వైపు అభినందిస్తున్నట్లు చూశాడు.

ఆ తరువాతేం మాట్లాడాలో నాకు తెలియలేదు. సహాయంకోసం వాడివైపు చూశాను. వాడు వెంటనే అందుకున్నాడు.

"వెదర్ చాలా బావుంది" అన్నాడు పందిటివైపు చూస్తూ.

"అవును! చాలా ఆహ్లాదంగా ఉంది" అన్నానేను.

"ఆ చెప్పులు..." అతనేదో చెప్పబోయాడు గాని, నరసింహం అడ్డుపడిపోయాడు.

"మీరెప్పుడైనా డార్జిలింగ్ వెళ్ళారా?" అడిగాడతనిని.

"లేదు. ఎందుకు?" ఆశ్చర్యంగా అన్నాడతను.

"అక్కడ ఎప్పుడూ ఇలా కూల్‌గా క్లౌడీగా ఉంటుంది వెదర్!" అన్నాడు వాడు.

"ఐ సీ" అన్నాడా వ్యక్తి.

"నేను త్రీ టైమ్స్ వెళ్ళానక్కడికి!"

ఆ వ్యక్తికి డార్జిలింగ్ గురించిగానీ, ఆహ్లాదకరమైన, వాతావరణంగురించిగానీ ఏమాత్రం ఆసక్తి ఉన్నట్లు లేదు. అందుకని టక్కున మళ్ళీ సబ్జెక్ట్‌లోకి దిగిపోయాడు.

"ఆ చెప్పులు..." అన్నాడు నా కాళ్ళవైపు చూపుతూ. నా మెదడంతా మొద్దుబారిపోయింది. ఇంక దేవుడు కూడా నన్ను రక్షించలేడు. ఈ దెబ్బతో పెళ్ళి పందిట్లో నా పరువంతా గోవిందా!

కానీ నరసింహం పరిస్థితిని చేయి దాటి పోనీకుండా మరో ప్రయత్నం చేశాడు.

"అందాకా ఎందుకూ—కొడైకెనాల్లో కూడా అచ్చం ఇలాగే ఉంటుంది."

కానీ ఆ వ్యక్తి అవేం పట్టించుకోలేదు. జలగలాగా పట్టేసుకున్నాడు.

"ఆ చెప్పులు—ఓసారి చూడనిస్తారా?" అన్నాడు నన్ను.

నాకేం తోచలేదు. "ఇహిహి— చెప్పులా?" అన్నాను.

"అవును! ఒకసారి చూడనిస్తారా?"

"ఎందుకు?"

"పనుంది!"

"ఏం పని?"

"ఏదో పని!"

"అలాగ!"

'అవును!"

'ఐ సీ."

"మరి చూడనిస్తారా?"

"ఏమిటి?"

"చెప్పులు!"

"ఎందుకు చూడటం?"

"పనుంది!"

"ఏం పని!"

"ఏదో పని!"

"ఐ సీ!"

"మిస్టర్! మీకే చెప్పేది." ఈసారి గొంతు పెంచి అన్నాడతను. అతని గొంతు మా ముందు వరుసలో కూర్చున్న మరి కొంతమందిని ఆకర్షించింది. అందరూ మా దగ్గరేదో సినిమా ఆడుతున్నట్లు మావైపు తిరిగి కూర్చుని చూడసాగారు.

నేను నరసింహంవైపు చూశాను. వాడు అర్జంటుగా గాలిలోకి చూశాడు.

"చూపించండి!" మరింత తీవ్రాగా అడిగాడతను.

నాకు తెలియకుండానే వణుకుతున్న నా కాళ్ళు కుర్చీ కింద నుంచి బయటికొచ్చాయి.

నరసింహం వెంటనే జోక్యం చేసుకున్నాడు.

"చాలా అద్భుతమైన చెప్పులు!" అన్నాడు నాతో. "మీక్కూడా నచ్చాయా?" అనడిగాడు ఆ ఎదుటి వ్యక్తిని. అతను ప్రశ్న పట్టించుకోలేదు.

"ఆ చెప్పులు ఎక్కడివి మీకు?" కొత్తగా రిక్రూట్ అయిన పోలీస్ కానిస్టేబుల్‌లాగా అడిగాడు.

"మీరే కాదు—ఇప్పటికి ప్రశ్న ఇరవై మున్గురు అడిగారు!" అన్నాడు నరసింహం మళ్ళీ జోక్యం చేసుకుని.

నేనేమీ మాట్లాడకపోవడం చూసి "కదురా?" అంటూ నా భుజం చరిచాడు.

"అవును!" ఒప్పుకున్నాను నేను. "ఇతనితో కలిసి ఇరవై నలుగురు" అంటూ సరిదిద్దాను.

"అంత అద్భుతమైన మోడల్" అన్నాడు నరసింహం.



నేను పుంజుకున్నాను.

"ఆ షాపువాడు నా ఫ్రెండ్ కాబట్టి—ఇచ్చాడు! అసలు ఎంత డబ్బు ఇస్తామన్నా ఎవ్వరికీ అమ్మటం లేదు" అన్నాను.

"అవును! ఆ తరువాత మన ఫ్రెండ్స్ చాలా మంది షాపుకెళ్ళి అడిగారు—ఎవ్వడికీ ఇవ్వలేదు!"

"అంతెందుకు—వీటినే ఎంత డబ్బు కావాలంటే అంత ఇస్తాం నాకిచ్చెయ్యమని రామచంద్రపిళ్ళె అడిగాడు."

"అవును! రామచంద్రపిళ్ళె! గుడ్ ఫెలో! హి ఈజ్ ఫ్రమ్ కేరళా! వెరీ ఫాండావ్ దీస్ చెప్పల్స్!" అన్నాడు నరసింహం.

"రామచంద్ర పిళ్ళె కదూ!?"

"అవును!"

"అసలు వాళ్ళ వంశమే అంతట—వెరీ ఫాండావ్ చెప్పల్స్! ఒకసారి 'మీసాలు నీవి, రోషాలు నావి' సినిమా క్యూలో నిలబడినప్పుడు వాళ్ళ పూర్వీకుల హిస్టరీ అతా చెప్పాడు నాకు!"

"ఆ క్యూ అంత పెద్దదా?"

"అవును!"

"మరా సినిమా ఎనిమిదో రోజున ఎలా వెళ్ళిపోయింది?"

"ఎవడన్నాడు ఎనిమిదో రోజు వెళ్ళిపోయిందని."

"ఆ హోలువాడు!"

"ఏడ్చాడు!"

"ఏం? ఎందుకు?"

"అది వెళ్ళింది తొమ్మిదో రోజున!"

"మరి వాడు ఎనిమిదో రోజు అంటాడేం?"

"వాడి మొఖం! వాడు తొమ్మిదో రోజు ఈ సినిమానే చూసి కొత్త సినిమా అనుకుని ఉంటాడు."

ఈ సంభాషణ ఆ వ్యక్తికి ఏమాత్రం నచ్చినట్లు లేదు. లేదు. అంచేత మళ్ళీ మధ్యలో అడ్డు పడ్డాడు.

"ఆ చెప్పులు మీవా?"

నరసింహం అతని మాటలు వినిపించుకోలేదు. మళ్ళీ రామచంద్ర పిళ్ళెని అడ్డం తెచ్చుకున్నాడు.

"రామచంద్రం పిళ్ళె వాళ్ళ తాత ఒకసారి ఆగ్రా వెళ్ళినప్పుడు అక్కడ ఫోర్ట్ గేటు పక్కనే ఒక చిన్న చెప్పుల దుకాణంలో అద్భుతమైన చెప్పులజత చూశాడట. 'అవెంత?' అని అడిగాడట వాడిని. వాడు ఇరవై రూపాయలు చెప్పాట్ట.

"అవి ఎవరు తయారు చేశారు?" అనడిగాట్ట.

"నేనే!" అని జవాబిచ్చాడట వాడు.

"ఇలాంటివి ఎన్ని జతలు చేశావ్?" అనడిగాడు ఆయన.

"ఇదొక్కటే చేశాను. దీన్నే ధర ఎక్కువని ఎవరూ కొనడం లేదు" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాట్ట వాడు. మరి రామచంద్ర పిళ్ళె తాతగారి రోజులంటే మన స్వాతంత్ర్యానికి పూర్వం అన్నమాట. అప్పుడు ఇరవై రూపాయలంటే ఎక్కువే కదా!

ఆయన వెంటనే వంద నోట్లు అయిదు తీసి వాడికిచ్చి "ఇలాంటివి ఇంకెవ్వరికీ చేయకుండా ఉంటానికిస్తున్నా నీ డబ్బు" అని చెప్పి ఆ చెప్పులు తీసుకు వచ్చేశాట్ట! ఇప్పటికీ ఆ చెప్పులు అలా ఉంచారు వాళ్ళింట్లో."

"వాళ్ళ ఫాదర్ కూడా మంచి చెప్పుల కోసం మలేసియా వెళ్ళినప్పుడు—ఇలాగే ఒక చిన్న దుకాణం వాడికి—"

రామచంద్ర పిళ్ళె వాళ్ళవంశం తాలూకూ చెప్పుల కథలు ఆ చుట్టూ కూర్చున్నవారికి మహా రసానుభూతిని కలిగిస్తున్నాయేమో కాని, ఆ వ్యక్తిని ఏమాత్రం కదిలించలేకపోతున్నాయ్. పైపెచ్చు రాను రాను అతనికి ఆ రామచంద్ర పిళ్ళెమీద, వాళ్ళ వంశం తాలూకూ చెప్పుల కథలు మనోజ్ఞకంగా వినిపిస్తున్న నరసింహం మీదా ద్వేషం ప్రబలిపోతున్నట్లు దాఖలా కనిపించింది.

"ఆ చెప్పులు మీవా అని అడుగుతున్నాను." ఇంచుమించుగా అరచినంత పని చేశాడతను. నాకు చెమటలు పట్టేసినయ్. నాటకం మధ్యలో తెర దించటం తప్పనిసరిగా కనబడుతోంది.

"ఏమిటన్నారు?" అడిగాను ఈలోగా జవాబు కోసం ఆలోచించుకుంటూ.

"ఆ చెప్పులు మీవా? అని నేను—మిమ్మల్ని—అడుగుతున్నాను." ఒక్కొక్క పదం విడదీసి స్పష్టం చేస్తూ అడిగాడతను.

"ఏ చెప్పులు?"

"అవిగో—అవి—కాళ్ళకున్నవి?"

"ఏ కాళ్ళకు?"

"మీ కాళ్ళకు!"

"వాటికేమయ్యిం దిప్పుడు?"

"ఆ చెప్పులు మీవేనా?"

"హ్హాహ్హాహ్హా" చాలా కాజువల్‌గా నవ్వాలనుకుని ప్రయత్నించాను గానీ, అది కాస్త వెర్రి నవ్వయి కూచుంది.

మొట్టమొదటి సారిగా నాతో ఈ వెధవ పని చేయించి, ఇన్నిలాంటి పరమ భయంకర పరిస్థితిలో పడేసిన నరసింహాంగాడిని హత్య చేయాలన్నంత కోపం వచ్చింది. కానీ, అప్పటికప్పుడు హత్య చేయడం అంత తేలికేం కాదు.

"ఏమిటది?" కోపంగా అడిగాడా వ్యక్తి.

"ఏమిటేమిటి?" ఏమీ తెలీనట్లు అడిగాను.

"ఇప్పుడు నా ప్రశ్నకు 'ఇహ్హాహ్హాహ్హా' అంటూ మీరుచేసిన ప్రక్రియ ఏమిటి అనిఅడుగుతున్నాను."

"అదా!" తేలిగ్గా అనేశాను.

"అవును! అదే!"

"నవ్వాను."

"యస్—అది నవ్వే!" తనూ ఒప్పుకున్నాడు నరసింహం.

"ప్లీజ్—డోంట్ ఇంటర్ ఫియర్!"నరసింహానికి వార్నింగిచ్చాడతను.

నరసింహం ఆశ్చర్యంగా అతని వేపు చూశాడు.

"డోంట్ ఇంటర్ ఫియరా?"

"అవును!"

"ఏమిటి డోంట్ ఇంటర్ ఫియర్?"

"మధ్యలో కల్పించుకోవద్దు అని రిక్వెస్ట్ చేస్తున్నాను."

"మధ్యలోనా?"

"అవును!"

"ఎవరి మధ్యలో?"

"మా మధ్యలో"

"మీరు ఏం చేస్తున్నారు."

"వెరిఫై చేస్తున్నాను. అంటే నిర్ధారించుకోవడం అన్నమాట!"

"ఏ విషయం?"

"చెప్పుల విషయం!"

"ఎవరివి?"

"ఆయన కాళ్ళకున్నవి!"

"అవా? ఇంపాజిబుల్! ఎంత ప్రయత్నించినా మీకలాంటివి ఎక్కడా దొరకవ్! రామచంద్ర పిళ్ళె అని వాళ్ళ ఫ్రెండ్ కూడా పాపం ఇలానే వాటికోసం ఎంతో మోజుపడ్డాడుట. అసలు వాళ్ళ వంశమే—"

"టు హెల్ విత్ రామచంద్రపిళ్ళె" అరచాడు ఆ వ్యక్తి.

"ఎందుకలా అరచారు?" ఆశ్చర్యంగా అడిగాడు నరసింహం.

"పిచ్చెక్కి!"

"అప్పుడప్పుడూ అలా ఎటాక్ వస్తుంటుందా, ఇదే మొదలా?"

ఆ వ్యక్తి మళ్ళీ నావేపు తిరిగాడు.

"మిస్టర్! జవాబు చెప్పండి!"

"ఏం జవాబు?"

"అదే. ఆ చెప్పుల గురించి!"

"ఏ చెప్పుల గురించి?"

"మీ కాలికున్నవి!"

"వాటి వివరాలు చెప్పానుగదా."

"నా క్కావలసింది వివరాలు కాదు—అవి మీవా అని అడుగుతున్నాను."

"ఎందుకు అడగడం?"

"ఎందుకా?"

"అవును, ఎందుకు?"

"ఎందుకో మీకు తెలీదా?"

"నాకా? నాకేం తెలుస్తుంది?"

"అవి మీవి కావు గనుక!"

ఆ మాటతో ఆ చుట్టుపక్కలున్నాళ్ళంతా ఉలిక్కిపడ్డారు.

నా మొహం కళ తప్పిపోయింది. మెదడు తోడవచ్చిపడిపోయింది. కేవలం మెడల్లా ఐబ్రాంగేటా దయమీద ఆధారపడి ఉంది పరిస్థితి.

"ఇవి నావికాదా?"

"కావు."

"మరెవరివి?"

"నావి!"

"మీవా?"

"అవును!"

"ఇంపాజిబుల్!" అన్నాను నరసింహం వంక చూసి.

"ఎన్. క్వాయిట్ ఇంపాజిబుల్" అన్నాడు వాడు.

"యూ ఆర్ మిస్టేకెన్" అన్నా న్నేను ఇంగ్లీష్‌లోకి పూర్తిగా దిగిపోతూ. ఇలా పది మందిలో పరువుపోయే పరిస్థితుల్లో కేవలం ఇంగ్లీషే మాట్లాడితే చాలా ఉపయోగం ఉంటుందని వాడే చెప్పాడు నాకు.

"ఊప్! ధరోలీ మిస్టేకెన్" అన్నాడు నరసింహం.

"మిస్టేక్ లేదూ—గాడిద గుడ్డూ లేదు. అవి నావి!" ఖండితంగా అన్నాడతను.

"హో హో. దే ఆర్ మైన్" అన్నాను.

"యప్! హి ఈజ్ ది హోల్ అండ్ సోల్ ఓనర్ ఆవ్ దీజ్ చెప్పల్స్" అన్నాడు నరసింహం.

"మేము కాదు అవి చెప్తున్నాను. అవి నావి!" కోపంగా అరచాడతను. సరిగ్గా అదే సమయంలో ఫస్ట్ షో సినిమా వదిలినట్లు మొదటిపంక్తిలో కూర్చుని భోజనం చేసిన జనం త్రేపున తేల్చుకుంటూ వచ్చి, మా చుట్టూ అప్పటికే గుమికూడిన చిన్న సైజు గుంపుని పెద్దదిగా చేశారు. రోడ్డుపక్కన గారడీచేసే గారడీ వాడిక్కూడా ఇంతమంది ఆడియెన్స్ ఉండరని ఖచ్చితంగా చెప్పవచ్చు.

పాత ప్రేక్షకులు కొత్తగా వచ్చిన వాళ్ళకి "ఇంతవరకూ జరిగిన కథ" క్లుప్తంగా చెప్పడం ప్రారంభించారు.

(ముగింపు వచ్చే సంచికలో)

రసవద్ఘట్టాలు

లలితాశాస్త్రి సాహసం

గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణ మహోద్యమంగా సాగుతూ ఉంది. కమలా నెహ్రూ కొందరు స్నేహితులతోపాటు అలహాబాద్‌లో విదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు పికెటింగ్ జరపాలనుకుంది. నెహ్రూ కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్న లాల్‌బహదూర్ శాస్త్రి భార్య లలితాదేవిని కూడా పికెటింగ్‌లో పాల్గొనేటట్లు చెప్పమని లాల్‌బహదూర్‌ను కోరింది కమలానెహ్రూ. ఆయన సమ్మతించాడు. కాని ఇల్లు వదలి బయటకు రావటం అలవాటులేని లలితాదేవిని మహిళలే స్వయంగా కలుసుకొని ఆమె సహకారం కోరడం సముచితంగా ఉంటుం దన్నాడు.

కమలానెహ్రూ స్వయంగా లాల్‌బహదూర్ ఇంటికి వెళ్ళి నేరుగా లలితాదేవి అత్తగారి అనుమతి కోరింది. అందు కావిడ సమ్మతించింది. లలితా శాస్త్రి, మోహన్‌లాల్ గౌతమ్ భార్య వీరిరువురికి కొన్ని దుకాణాలు కేటాయించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విదేశీ సరుకులు అమ్మే ఆ దుకాణాల ముందు పికెటింగ్ జరపాలి. ఆ తరువాత మరో మహిళా దళం ఆ పనిని కొనసాగిస్తుంది. మొదటి రోజు కాస్త బిడియంగా ఉన్నారీ మహిళా స్వయం సేవకులు. లాల్‌బహదూర్, గౌతమ్‌లు వారి భార్యల సాహసాన్ని మెచ్చుకుంటూ దూరంగానే చూసి వెళ్ళిపోయారు.

రెండో రోజున లలితాదేవి, ఆమె స్నేహితురాలు విదేశీ వస్త్రాలు అమ్మే పెద్ద దుకాణం ముందు నిల్చుని దుకాణానికి వచ్చే స్త్రీలు, పురుషులతో నిస్సంకోచంగా మాట్లాడుతూ విదేశీ సరకులు కొనకుండా ప్రోత్సహించారు.

ఒక రోజు సంపన్న కుటుంబీకురాలు ఒకావిడ పెళ్ళికోసం ఎన్నో వస్త్రాలు కొని, పెళ్ళికూతురు కోసం పెద్ద దుకాణంలో విలువైన విదేశీ చీర కొనాలని వచ్చింది. లలితాశాస్త్రి, శ్రీమతి గౌతమ్ ఆమెను విదేశీ వస్త్రాలు కొనవద్దని బతిమాలారు. దుకాణ యజమానికి ఆగ్రహం కలిగింది. అతను లలితా శాస్త్రి గారి వద్దకు వెళ్ళి 'అమ్మా! మీరు అందరినీ బతిమాలుకొంటున్నారు కాని, మీ చేతుల్లోని గాజులు విదేశీ సరుకు అని గుర్తుంచుకోండి' అన్నారు.

తన గాజులు విదేశీ సరుకు కాదని లలితాశాస్త్రి నమ్మకం. అంతలో శ్రీమతి గౌతమ్ దుకాణదారు నుద్దేశించి 'అయ్యా! మీ చేతి గడియారం విదేశీ సరకు, మా లలితా శాస్త్రిగారి గాజులు విదేశీ గాజులు కావు' అన్నది. వాదోప వాదాలు జరిగిన తరువాత లలితా శాస్త్రి—'నా గాజులు విదేశీ సరుకు అయితే వాటిని ముక్కలు చేస్తాను. అలాగే మీ రిస్టు వాచీ విదేశీయమైనదని తేలితే దానిని కూడా ముక్కలు చేయాలి' అన్నది.

సంప్రదాయ కుటుంబానికి చెందిన మహిళ గాజులను ప్రాణప్రదంగా భావిస్తుంది. వాటిని పగులగొట్టుకోవటం వైధవ్యానికి సంకేతం. లలితా దేవి నుదుటిపైని పెద్ద కుంకుమ, గాజులు ఆమె సాంప్రదాయక నిష్ఠను చాటుతున్నాయి. గాజులు పగుల గొట్టుకోవడానికి ఏ పుని స్త్రీ కూడా సమ్మతించదని దుకాణదారు విశ్వాసం. 'అయితే ముందు మీ గాజులు పగులగొట్టుకోండి. చేయటం కంటే చెప్పటం సులువు' అని సవాల్ చేశాడు దుకాణం యజమాని.

లాల్‌బహదూర్‌శాస్త్రి, గౌతమ్‌లు పికెటింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ తమ భార్య లున్న చోటుకు వచ్చేసరికి పెద్ద గుంపు దుకాణం ముందు ఉన్నది. దుకాణదారు సవాల్‌కు సమాధానం చెప్పలేకున్నారా మహిళా మణులు. లలితాశాస్త్రి గుంపులో ఉన్న తన భర్త వైపు చూసింది. ఆయన కనుసైగ చేస్తూ 'కానివ్వు' అన్నాడు. లలితాశాస్త్రి చేతుల కున్న గాజుల్లో ఒక్కొక్క చేతి నుండి రెండింటిని తీసి చీర కొంగుకు కట్టింది. దుకాణం లోని ఇత్తడి కొలబద్దను తెప్పించుకొని గాజు లన్నింటినీ బద్దలుచేసింది.

దుకాణందారు నిర్ఘాంతపోయాడు. సంప్రదాయం మూర్తీభవించిన ఆ మహిళ అంత సాహసం చేస్తుందని ఆయన వూహించలేకపోయాడు. శ్రీమతి గౌతమ్—'అయ్యా! తమ గడియారాన్ని ముక్కలు చేయండి' అని అడిగింది. 'అసలు నే నా మాట అనలేదు' అంటూ యజమాని అడ్డం తిరిగాడు. మాట తప్పిన దుకాణందారు వాలకంచూసి, అక్కడ మూగిన ప్రజానీకం రెచ్చిపోయింది. పెళ్ళి గుడ్డలు కొనడానికి వచ్చిన మహిళ దుకాణందారును మందలిస్తూ, తాను కొన్న విదేశీ వస్త్రాలను దుకాణం ముందు కుప్పగా పోసి అందరూ చూస్తున్నట్లే తగులబెట్టింది. రెచ్చిపోయిన ప్రజానీకం ఆ దుకాణాన్నే తగులబెట్టింది.

తమ భార్యల సాహసాన్ని మెచ్చుకుంటూ గుంపులో నుండి ఎప్పుడో కనుమరుగయ్యారు లాల్‌బహదూర్, గౌతమ్ గార్లు.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి